విధి వంచితులైన ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా భవిత కేంద్రాలకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వాటితో భవిత కేంద్రాల్లో వసతులతో పాటు పిల్లలకు సౌకర్యాలు కల్పించనున్నారు. పాఠశాలల మాదిరిగానే ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తారు. అవసరమైన వారికి ఫిజియోథెరపీ చేయించడంతో పాటు నెలనెలా రవాణా భత్యాన్ని కూడా చెల్లిస్తారు.



జనగామలో దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న దృశ్యం

విధివంచిత బాలలకు భరోసా

బాధితుల కోసం జిల్లాలో కొనసాగుతున్న సర్వే

ఇప్పటి వరకు 103 మంది గుర్తింపు

గతేడాదితో కలిపి మొత్తంగా 1,136 మంది

జిల్లావ్యాప్తంగా 12 భవిత కేంద్రాల్లో శిక్షణ

సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు

జఫర్‌గఢ్, జనవరి 2: మానసికంగా, శారీరకంగా వైకల్యం ఉన్న బాల బాలికలకు వివిధ పద్ధతుల్లో విద్యను అందించి సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు 2010లో సమ్మిళిత విద్యా వనరుల కేంద్రాల (ఐఈఆర్‌సీ)ను ఏర్పాటు చేశారు. వీటిని భవిత కేంద్రాలుగా పిలుస్తున్నారు.. జిల్లాలో ప్రస్తుతం మండలానికి ఒకటి చొప్పున 12 భవిత కేంద్రాలు ఉన్నాయి. 0-19 ఏళ్ల లోపు మానసిక, శారీరక దివ్యాంగులకు ఐఈఆర్‌పీల ద్వారా ఇక్కడ సేవలందిస్తున్నారు. ఈ కేంద్రాల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తూ సాధారణ పాఠశాలల మాదిరిగానే ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తారు. వారంలో ఒక రోజు ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహిస్తారు. పిల్లలకు నెలకు రూ.500 చొప్పున 10 నెలల పాటు రవాణా భత్యం చెల్లిస్తారు. అదేవిధంగా ఈ ఏడాది నుంచి భవిత కేంద్రాలకు వెళ్లే వారితో పాటు ఇంటి వద్ద శిక్షణ పొందే పిల్లలకు ఎస్కార్ట్ అలవెన్సు రవాణా భత్యం, బాలికలకు స్కాలర్ షిప్, అంధులకు రీడర్ అలవెన్స్ అందిస్తారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లోని భవిత కేంద్రంలో ...



చిన్నపెండ్యాలలో బాలలలకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

జిల్లాలో కొనసాగుతున్న గుర్తింపు సర్వే...

జిల్లాలో దివ్యాంగ పిల్లలను గుర్తించేందుకు సర్వే కొనసాగుతోంది. గత డిసెంబర్ 19 నుంచి చేపట్టిన ఈ సర్వేను ఈనెల 10 వరకు నిర్వహించనున్నారు. పూర్తి దృష్టిలోపం, తక్కువ చూపు, వినికిడి లోపం, భాషణ, కదలిక వైకల్యం, మెదడు పక్షపాతం, బుద్ధి మాంద్యం, నిర్దిష్ట అభ్యసన వైకల్యం, ఆటిజం, మానసి క రుగ్మత, దీర్ఘకాలిక నరాల సమస్య, మల్టిపుల్ స్క్లెరెసిస్, పార్కిన్సన్, హిమోఫీలియా, వంటి వాటితో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారికి అవసరాల మేరకు శిక్షణతో పాటు విద్యను అందిస్తారు. వారిలో బడి ఈడు పిల్లలు ఉంటే సమీపంలోని పాఠశాలల్లో చేర్పిస్తారు.

ప్రస్తుతం 103 మంది గుర్తింపు

డిసెంబర్ 30వ తేదీ వరకు జిల్లాలో 103 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించారు. 2022-23 సంవత్సరం వరకు గుర్తించిన 1,033 మందితో కలిపి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,136 మంది ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించినట్లు అధికారులు చెబు తున్నారు. వీరిలో 139 మంది పిల్లలు భవిత కేంద్రా ల్లో, 815 మంది ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శిక్షణ పొందుతూ, విద్యాభ్యాసం చేస్తుండ గా.. మిగతా నడవలేని, శారీరక, మానసికంగా ఇబ్బందులు పడే పిల్లలు వారి ఇళ్లల్లో శిక్షణ పొందుతున్నారు.

కొత్త భవిత కేంద్రాలకు నిధులు మంజూరు..

జిల్లాలో కొత్తగా ఏర్పాటైన చిలుపూర్, తరిగొప్పుల మండలాల్లోని రెండు భవిత కేంద్రాలకు రూ.50 వేల చొప్పున రూ.లక్ష నిధులు మంజూరయ్యాయి. కేంద్రాలకు అవసరమైన సామగ్రి, బోధనోపకరణాలను సమకూర్చేందుకు ఈ నిధులను ఖర్చు చేస్తారు.

భవిత కేంద్రాల్లో శిక్షణ..

- బి.నర్సింహారావు, సమ్మిళిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్



శారీరక, మానసిక వికలాంగులైన పిల్లలకు జిల్లాలోని భవిత కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నాం. మరి కొంత మంది ప్రభుత్వ పాఠశాలలు, ఇళ్లల్లోనూ శిక్షణ పొందుతూ విద్యను అభ్యసిస్తున్నారు. డిసెంబర్ 30వ తేదీ వరకు జిల్లాలో 103 మందిని గుర్తించాం. ఇప్పటి వరకు మొత్తంగా జిల్లాలో 0-19 ఏళ్ల లోపు 1,136 మంది దివ్యాంగ పిల్లలు ఉన్నారు. ఇందులో జిల్లాలోని 12 భవిత కేంద్రాల్లో 139 మంది పిల్లలకు 20 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు (ఐఈఆర్‌పిలు) శిక్షణ ఇస్తున్నారు. మరో 815 మంది ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, మిగతా 182 మంది వారి ఇళ్లల్లో ఉంటూ శిక్షణ పొందుతున్నారు.

పిల్లల ఉజ్వల భవితకు దోహదం..

- కె.రాము, జిల్లా విద్యాధికారి



ప్రత్యేక అవసరాల పిల్లలకు సమగ్ర శిక్షణ, విద్యను అందిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తున్నాం. భవిత కేంద్రాల్లో ప్రత్యేక నిపుణులైన ఉపాధ్యాయులు పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేస్తున్నారు. పిల్లల గుర్తింపు సర్వే ఇంకా కొనసాగుతోంది. భవిత కేంద్రాల్లో అన్ని రకాల సేవలు అందిస్తూ మెరుగైన శిక్షణ, బోధన అందిస్తున్నాం. దివ్యాంగ పిల్లలను సాధారణ విద్యార్థుల్లాగా తీర్చిదిద్దేందుకు భవిత కేంద్రాలు దోహదపడుతున్నాయి.

పైసా ఖర్చు లేకుండా పథకాలు అందివ్వాలి

అధికారులతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ 22వ వార్డులో దరఖాస్తును పరిశీలిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ టౌన్, జనవరి 2: లబ్ధిదారులకు పైసా ఖర్చు కాకుండా ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జనగామ 22వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. అధికారులతో మాట్లాడి దరఖాస్తుల స్వీకరణపై వివరాలు తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఇచ్చే దరఖాస్తులను చూసి వారితో మాట్లాడారు. ఏ పథకానికి దరఖాస్తు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆయన వడ్లకొండ గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. వీలైనంత త్వరగా రోడ్డు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇటీవల బీఆర్ఎస్ నాయకుడు దండోబయిన సత్యనారాయణ తల్లి కొమురమ్మ మృతిచెందగా ఆయనను పరామర్శించారు.

నర్సాపూర్‌లో దరఖాస్తుల పరిశీలన

తరిగొప్పుల: మండలంలోని నర్సాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తుదారులు తెలుసో తెలియకో అప్లికేషన్ ఫారంలో ఏమైన పొరపాట్లు చేస్తే అధికారు సరి చేయాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు అందరికీ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పింగిళి జగన్‌మోహన్ రెడ్డి, జొన్నగోని హరిత సుదర్శన్ గౌడ్, బెల్లం రాజు, దామెర ప్రభుదాస్, అమిరిశెట్టి వీరేందర్, రవి నాయక్, ఎండబట్ల అంజమ్మ, చెన్నూరి ప్రమీల పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టత ఇవ్వాలి

ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



తీగలతండాలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిలుపూర్, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించి ప్రజలకు పూర్తి స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. మంగళవారం తీగలతండాలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన దరఖాస్తు ఫారంలో అనేక అనుమానాలున్నాయని అన్నారు. కౌలు రైతులను ఎలా గుర్తిస్తారు? 200 యూనిట్లు దాటిన విద్యుత్ వినియోగదారులకు పై యూనిట్లకే బిల్లు వేస్తారా లేక మొత్తం యూనిట్లకు వేస్తారా? ఉద్యమకారులను ఎలా గుర్తిస్తారు? రేషన్‌కార్డు లేనివారి పరిస్థితి ఏంటి.. తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మారెపల్లి తిరుమల కృష్ణమోహన్ రెడ్డి, మాలోతు లక్ష్మీరాగూర్, ఎంపీటీసీ మారెపల్లి లలితాదేవి శ్యామ్‌కుమార్ రెడ్డి, ఎంపీడీవో పులుగు వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో శ్రీపాద మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రాజవరంలో ఫ్లెక్సీ రగడ..

చిలుపూర్ మండలం రాజవరంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట స్థానిక కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీంతో రగడ మొదలైంది. బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె ఫ్లెక్సీ ఎలా పెడతారని నిలదీయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. సర్పంచ్ తిరుమల కృష్ణమోహన్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ షైమావతి జోక్యంతో గొడవ సద్దుమణిగింది.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోండి

కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య

పలు మండలాల్లో ప్రజాపాలన కేంద్రాల పరిశీలన



లింగాలఘణపురం మండలం వడ్డిచర్లలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

జఫర్‌గఢ్/లింగాలఘణపురం/పాలకుర్తి/కొడకండ్ల, జనవరి 2 : సంక్షేమ పథకాల కోసం ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాల్లో అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య సూచించారు. అదనపు కలెక్టర్ పర్మర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి ఆయన మంగళవారం జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించి ప్రజా పాలన కేంద్రాల్లో దరఖాస్తు ప్రక్రియను పరిశీలించారు. జఫర్‌గఢ్ మండలం తిడుగులో దరఖాస్తు స్వీకరించే విధానం, ఏర్పాటు చేసిన బారికేడ్లు, క్యూలైన్లు, ప్రత్యేక కౌంటర్లు, సలహా శిబిరం తదితర సౌకర్యాలను ఆయన పరిశీలించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలతో పాటు జనగామ పట్టణంలో షెడ్యూల్ ప్రకారం ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు సౌకర్యాలను కల్పించామన్నారు. సందేహాల నివృత్తికి కేంద్రాల వద్ద హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు. పాలకుర్తి మండలం తొర్రూరు, దర్దెపల్లి, తీగారం, లక్ష్మీనారాయణపురం, టీఎస్‌కేతండా, పెద్దతండా (కే) గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైతే దరఖాస్తులు స్వీకరణ గడువును ప్రభుత్వం పొడిగిస్తుందని అన్నారు. లింగాలఘణపురం మండలం వడ్డిచర్ల గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ సందర్శించారు. గ్రామంలో అవసరమైనన్ని దరఖాస్తు ఫారాలను అందజేయకపోవడంతో గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఆందోళన చెందాల్సిన పనిలేదని, వెంటనే తెప్పిస్తానని హామీ ఇచ్చారు. కొడకండ్ల మండలంలోని పాకాల, లక్ష్మక్కపెల్లి గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి ప్రజలతో మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు మొత్తం 5619 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ బాటసారికి ఘన స్వాగతం



పాలకుర్తిలో స్వాగతం పలుకుతున్న ప్రజాసంఘాల నాయకులు

పాలకుర్తి, జనవరి 2: పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ హర్యానా రాష్ట్రానికి చెందిన అజయ్‌కుమార్ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం పాలకుర్తికి చేరుకోగా ప్రజాసంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే దేశంలో 18 రాష్ట్రాలు తిరిగానని, పర్యావరణ పరిరక్షణపై విస్తృత ప్రచారం చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో మంచుప్పుల సర్పంచు కొంరయ్య, స్థానికులు భా స్కర్, తరాల చంద్రబాబు, గుమ్మడిరాజు సాంబయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

అభయహస్తానికి దరఖాస్తు చేసి వెళ్తుండగా ఘటన



వడ్డిచర్ల వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నరేష్

లింగాలఘణపురం, జనవరి2: మండలంలోని వడ్డిచర్ల గ్రామం వద్ద జనగామ-సూర్యాపేట జాతీయరహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా మండలం వీరారం శివారు కెలావత్ తండాకు చెందిన కెలావత్ నరేష్(35) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నరేష్ హైదరాబాద్‌లో నివాసముంటూ ఓ తెలుగు దినపత్రికలో పనిచేస్తున్నాడు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వీరారం గ్రామపంచాయతీలో మంగళవారం అభయహస్తం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు స్వగ్రామానికి వచ్చి తిరిగి వదిన కవితతో కలిసి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో వడ్డిచర్ల వీరభద్ర పెట్రోల్ బంక్‌వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నరేష్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందగా కవిత స్వల్పగాయాలతో బయటపడింది. నరేష్‌కు భార్య విమల, ఇద్దరు కుమారులు ఉన్నారు. లింగాలఘణపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయోమయంగా ప్రజాపాలన

అవగాహన లేకుండా దరఖాస్తులు

కావాలనే కాలయాపన చేస్తున్న సర్కారు: కడియం

వివరాలు 8లో..

ఐనవోలు జాతర ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

ఐనవోలు, జనవరి 2: ఐనవోలు జాతర ఏర్పాట్లను దేవదాయధర్మదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం ఆలయానికి వచ్చిన కమిషనర్ అధికారులతో సమావేశమై జాతర ఏర్పాట్లను ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావును అడిగి తెలుసుకున్నారు. జాతరలో ఎలాంటి లోటు పాట్లు జరుగకుండా భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అంతకు ముందు కమిషనర్ స్వామి వారిని దర్శించుకోగా అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. డిప్యూటీ కమీషనర్ టి. శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమీషనర్ ఆర్. సునీత, అధికారులు సంజీవరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతర పార్కింగ్.. క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర పార్కింగ్ క్యూలైన్ల ఏర్పాట్లను ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అధికారులతో కలిసి పరిశీలించారు. మామునూరు ఏసీపీ సతీష్, పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై నవీన్‌కుమార్‌లతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆలయానికి వచ్చే నాలుగుదారులకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలాలతోపాటు క్యూలైన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సకాలంలో పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకరావాలని తెలిపారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న కమిషనర్ అనిల్‌కుమార్

అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

▸▸ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

నయీంనగర్, జనవరి 2: అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో మంగళవారం వివిధ శాఖల డైరెక్టర్లు, ఐఎన్‌టియూసీ-327 యూనియన్ నాయకులు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా పరిపుష్టిగా కంపెనీ ఉండాలంటే అందరూ కలిసికట్టుగా పని చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. వినియోగదారులను గౌరవించడం వారి సమస్యలను పరిష్కరించడం ఏటి అండ్ సి నష్టాలను తగ్గించాలని ఆయన కోరారు. విద్యుత్ భద్రతా సూచనలు ఉద్యోగస్తులు, వినియోగదారులు విధిగా పాటిస్తూ విద్యుత్ ప్రమాదాలను నివారించాలని ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పిమోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, ఐఎన్‌టియూఈ-327 యూనియన్ నాయకులు మహేందర్‌రెడ్డి, బుచ్చయ్యగౌడ్, నీలారావు శ్రీనివాస్, ఓదేలు, సోమయ్య, సీజీయంలు, జీయంలు పాల్గొన్నారు.



సీఎండీ వరుణ్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లు

అభివృద్ధి పనులు ముందుకు సాగేనా, ఆగేనా?

హడావుడి ప్రారంభాలు, ప్రస్తుత ఎమ్మెల్యే ఆదరించేనా..

- విద్య వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కేటాయింపు కాని డబుల్ ఇళ్లు, పూర్తికాని రహదారులు

తొర్రూరు రూరల్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 2 : పాలకుర్తి నియోజకవర్గానికి కేంద్రంగా ఉంటూ అన్నిరంగాల్లో దినదినాభివృద్ధి చెందుతున్న తొర్రూరు మండలం ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి ఎస్.సుధాకర్ రావు, దుగ్యాల శ్రీనివాసరావు ఎమ్మెల్యేలుగా కొనసాగినా స్వరాష్ట్రంలో 2014, 2018 సంవత్సరంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా కొనసాగుతూ కొంతమేర అభివృద్ధి చేసినప్పటికీ ఆశించిన మేరకు కాలేదు. దీంతో 2023 అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో తొర్రూరు మండలంలో కోట్లాది రూపాయల పనులకు హడాహుడిగా శంకుస్థాపనలు చేసి, ఎర్రబెల్లి ఓడిపోయారు. శంకుస్థాపన పనులు జరిగిన అభివృద్ధి పనులు ముందుగు సాగేనా, నూతనంగా గెలుపొందిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తొర్రూరు మినిట్యాంకు బండ్, విద్యావైద్యం, బెడ్రూం ఇళ్లు, రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరముంది.


తొర్రూరు మండలం గోపాలగిరిలో ఆయిల్ పామ్ పరిశ్రమ జరిగే స్థలం, శిలాఫలకం (ఫైల్)


మినీట్యాంకు బండ్ కోసం పిల్లర్ల నిర్మాణంకే పరిమితమైన తొర్రూరు పెద్ద చెరువు


తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో పూర్తి అయిన డబుల్‌బెడ్రూం ఇళ్లు

మినీట్యాంకు బండ్, ఆయిల్‌పామ్ పరిశ్రమ పూర్తి అయ్యేనా..?

తొర్రూరు పెద్దచెరువును మినీట్యాంకు బండ్ చేస్తామంటూ 2017-18 సంవత్సరంలో గత ప్రభుత్వం రూ.3 కోట్ల 60 లక్షల నిధులను మంజూరు చేసింది. బండ్ పనులకు హడావుడిగా టెండర్లు పిలిచారు. దీంతో రూ.2 కోట్ల 19 లక్షలతో కాంట్రాక్టర్లు కట్ట మరమ్మతులు, బ్రిడ్జి నిర్మాణం కోసం పిల్లర్లు, పూడికతీత వంటి పనులు చేసి వదిలేశారు. మొత్తంగా బతుకమ్మ ఘాట్, బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉన్నా ఆటువైపు కన్నెత్తి చూడటం లేదు. పూర్తిస్థాయిలో ట్యాంక్ బండ్ నిర్మాణం కావాలంటే అధిక నిధులు కావాల్సి ఉంటుందంటూ అందుకనుగుణంగా స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరువ చూపి త్వరితగతిన పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నూనెగింజల ఉత్పత్తి చేయాలనే లక్ష్యంగా ఆయిల్‌ఫాం పంట సాగుకు సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించింది. అందులో భాగంగానే పంటను విక్రయించుకోవడానికి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో తొర్రూరు మండలం గోపాలగిరి గ్రామంలో 111 సర్వేనెంబర్‌లో సుమారు 85 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి ఆయిల్ ఫెడ్ సంస్థకు అప్పగించారు. అందులో 45 ఎకరాల్లో రూ.175 కోట్ల నిధులతో అత్యాధునికమైన పరిశ్రమను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావడం కోసం ఎర్రబెల్లి దయాకర్ రావు సెప్టెంబరు 2023న ప్రారంభించారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాలో వెయ్యికి పైగా రైతులు 4,769 ఎకరాలలో పామాయిల్ సాగు కొనసాగతుండగా, 2023-24కుగాను 8 వేల ఎకరాల పంట సాగు చేయడానికి లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. వచ్చే ఏడాది కొంత పంట చేతికి వచ్చే సమయానికి పరిశ్రమను అందుబాటులోకి తీసుకురావాలని ఆయిల్‌ఫాం రైతులు కోరుతున్నారు.

ఇళ్ల కేటాయింపు చేయాలి

తొర్రూరు మండలంలోని పేద ప్రజల సంక్షేమానికి ఇళ్లు లేనిపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పడంతో కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించినా కేటాయింపులు చేయలేదు. గృహలక్ష్మీ పథకం కింద రూ.5లక్షలు ఇస్తామనడంతో సుమారు 3,418 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. తొర్రూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని సుమారు 900 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా, 200 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. అయితే కర్కాల, కంఠాయపాలెం, గుర్తూర్, మాటేడు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి అయినా లబ్ధిదారుల ఎంపిక చేకపోవడంతో నిరుపయోగంగానే ఉన్నాయి. గుర్తూర్ గ్రామంలో 40 ఇళ్లకుగాను 20, కర్కాల గ్రామంలో 20 ఇళ్లు పూర్తైనా లబ్ధిదారుల కేటాయింపు చేయకపోవడంతో ప్రజలు వెళ్లి ఉంటున్నారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా తొర్రూరు మండలంలోని కర్కాల గ్రామంలో పాలేరు వాగు పై బ్రిడ్జి, గుర్తూర్ -ఎర్రబెల్లి గూడెం గ్రామాల మధ్య ఆకేరు వాగు పై నిర్మించే బ్రిడ్జి నిర్మాణాలకు నిధులు కేటాయించి శంకుస్థాపన చేశారు. అయితే గుర్తూర్‌లో నిర్మించే బ్రిడ్జి నిర్మాణానికి రూ.12 కోట్ల 64 లక్షలకు టెండర్లు పిలిచి ఓపెన్ చేయలేదు. గుర్తూర్ గ్రామం నుంచి మడిపల్లి, ఫత్తేపురం, తొర్రూరు వచ్చే రహదారి నిర్మాణం పనులు ప్రారంభించి వదిలేశారు. గోపాలగిరి, చెర్లపాలెం మధ్య రహదారి, చింతలపల్లి, కొమ్మనపల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారి, మున్సిపాలిటీలో పలు కాలనీల్లో కంకరపోసి వదిలేశారు. మండల వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించడం కోసం స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వంద పడకల ఆస్పత్రి కోసం ఎదురుచూపులు..

తొర్రూరు మండలంలో గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్తామామలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, రాజేందర్ రెడ్డి దంపతులు సొంత ఖర్చులతో నిర్మించిన 30 పడకల ఆస్పత్రి మాత్రమే ఉంది. రోగుల తాకిడితో ఆస్పత్రి భవనం సరిపోకపోవడంతో వంద పడకల ఆస్పత్రి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయంలో వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేసి తొర్రూరు, మరిపెడ మండలాలకు సంబంధించి వంద పడకల ఆస్పత్రిని మరిపెడ మండల కేంద్రంలో అప్పటి వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. వంద పడకల ఆస్పత్రికి సుమారు 3 ఎకరాల స్థలం అవసరం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో స్థల సేకరణ చేయాల్సి ఉంది. అప్‌గ్రేడ్ అయినా ఆ స్థాయిలో వైద్యపరీక్షలు మాత్రం అందకపోగా, కనీసం ఆస్పత్రిలో గైనకాలజిస్టు, పిల్లల వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఎంబీబీఎస్ వైద్యులు నామమాత్రంగా చూస్తున్నారు. గ్రామీణ ప్రాంతా ప్రజలు ప్రత్యేక వైద్యనిపుణుల కోసం వరంగల్, ఖమ్మంతో పాటు ప్రసవాలకు వర్ధన్నపేట, వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రికి వెళ్తున్నారు. అదేవిధంగా తొర్రూరు, పెద్దవంగర మండలాల నుంచి డిగ్రీ విద్యను పూర్తి చేసి ఉన్నత విద్యను అభ్యసించడానికి పీజీ, బీఈడీ, ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడంతో వరంగల్, హైదరాబాద్, ఖమ్మం ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసించే ఆర్థిక పరిస్థితి లేని పేద విద్యార్థులు మధ్యలో చదువులు మానేస్తున్నారు. ఇప్పటికైనా విద్య, వైద్యం పై ప్రత్యేక దృష్టిసారించాలని విద్యార్థులు, మేధావులు కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే నాయిని


కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 2 : కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నిరుపేద విద్యార్థుల కోసం ఎమ్మెల్యే నోట్‌బుక్స్ అందజేశారు. విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసినందుకు ఎమ్మెల్యేకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇవి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నెలాఖరులోగా రైస్ మిల్లర్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

హనుమకొండ రూరల్, జనవరి 2 : పెండింగ్‌లో ఉన్న రైస్ మిల్లుల యాజమాన్యం గడువులోగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధేశించిన గడువులోగా రైస్ మిల్లర్లు బియ్యానికి సంబంధించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్‌లో వచ్చిన ధాన్యం నుంచి రావాల్సిన బియ్యం పలు మిల్లుల నుంచి ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెల 31వ తేదీలోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మీ, డీఎం మహేందర్, సివిల్ సప్లయీస్ డీటీలు రమేశ్, కృష్ణ, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 17 మంది డీబార్

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన 17 మందిని తనిఖీ అధికారులు డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.తిరుమలదేవిలు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరీక్షల కేంద్రాల్లో మాల్ ప్రాక్టీస్ పాల్పడిన ఐదుగురిని, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని కళాశాలలో 8 మందిని, ఉమ్మడి ఖమ్మంలో జిల్లాల పరిధిలోని కళాశాలల్లో మరో 4 మంది డీబారైనట్లు తెలిపారు.

కేయూలో ఇద్దరికి బోధనేతర కారుణ్య ఉద్యోగాలు

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగ విధుల్లో పని చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు బోధనేతర సిబ్బంది ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలలో భాగంగా ఇద్దరికీ ఉద్యోగాలు కల్పించారు. ఈ మేరకు మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరీక్ష విభాగంలో పనిచేస్తూ మృతి చెందిన నారగోని వెంకన్న కుమారుడు నారగోని శివాజీ గౌడ్‌కు క్లర్క్ కం టైపిస్టుగా, అలాగే సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పనిచేసిన బస్కుల పోచయ్య కుమారుడు బస్కుల సునిల్‌కు కామాటిగా వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఉద్యోగ నియమాకాల పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు, ఇతర ఉద్యోగ సంఘాల నేతలు, వర్సిటీ ఉద్యోగులుపాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

హనుమకొండ క్రైం, జనవరి 2 : హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి రమేష్ మంగళవారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. జీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబరు 31, జనవరి 1న రాత్రి హనుమకొండ పరిధిలోని కుమార్‌పల్లి, కేయూ జంక్షన్, అశోక జంక్షన్, పెద్దమ్మగడ్డ ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో సుమారు 75 మందిని మద్యం తాగినట్లు గుర్తించి మంగళవారం కోర్టుకు తరలించారు. వీరిలో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నారాయణతండాకు చెందిన అజ్మీర ప్రకాశ్, వరంగల్ దేశాయిపేటకు చెందిన తమ్మిశెట్టి తిరుపతిలకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ఇంకా 73 మందికి రూ. 1.22 లక్షల జరిమానా విధించారు. జైలు శిక్ష పడిన వారిని కోర్టు హెడ్‌కానిస్టేబుల్ రాచకొండ రమేష్ పరకాల జైలు అధికారులకు అప్పగించారు.

ఉపాధి శిక్షణ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు

మడికొండ, జనవరి 2: మడికొండ వ్యాసపురి కాలనీలోని వేదవ్యాస పబ్లిక్ స్కూల్ ఆవరణలో సేవా భారతి, గోద్రేజ్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం కౌశలం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నిర్వాహకులు రాసమల్ల మహేష్ తెలిపారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరుతో ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్ ఓవెన్ తదితర గృహోపకరణ వస్తువుల రిపేరులో శిక్షణ ఇచ్చి అనంతరం వారికి గోద్రేజ్, రిలయన్స్, ఐఎస్‌ఫ్పీ వంటి ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే శిక్షణలో ఆసక్తి గల నిరుద్యోగ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 90599 07740 నెంబర్‌లో సంప్రదించాలని మహేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి,జెడ్‌పీటీసీ సరిత,సర్పంచ్ రాజిరెడ్డి,ఎంపీటీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

7న డీటీయూ ఆవిర్భావ సభ

డీటీయూ రాష్ట్ర నేత దామెర ఉపేందర్


డీటీయూ ఆవిర్భావ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

వడ్డెపల్లి, జనవరి 2: మహానీయులు గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతి రావుపూలే, సావిత్రిబాయి పూలే, జాన్ డ్యూయి ఎడ్యుకేషనల్ ఫిలాసఫర్, బీఆర్. అంబేద్కర్ అందించినటువంటి జ్ఞాన వారసత్వాన్ని కొనసాగిస్తూ వారి ఆలోచన విధానంలో పనిచే యడం కోసం ఈ నెల 7న హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని ఎస్‌వీకే కన్వెన్షన్ హాల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల నాయక త్వంలో ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) ఆవిర్భావ సభను నిర్వహించనున్నట్లు డీటీయూ రాష్ట్ర నేత దామెర ఉపేందర్ తెలిపారు. మంగళవారం రాంనగర్‌లో నిర్వహించిన డీటీయూ ఆవిర్భావ సన్నాహక కమిటీ బాధ్యుల సమావేశంలో ఆవిర్భావ సభకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 80 వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని అన్నారు. మహానీయుల ఆలోచనలతో ధర్మ టీచర్స్ యూనియన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉపాధ్యాయులు సంఘటితం కావల్సిన సమయం ఆసన్న మైందని పేర్కొన్నారు. ఆవిర్భావ సభకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. డీటీయూ ఆవిర్భావ బాధ్యులు సాంబయ్య, శ్యాంసుందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 2: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న గోవులను మంగళవారం సాయంత్రం డివిజన్ కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నిర్వాహకులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్సై జగదీష్ తెలిపిన ప్రకారం వేములవాడ గోశాల నుంచి మండలంలోని జీకే తండాకు 20గోవులను తరలించేందుకు పర్మిట్ తీసుకుని దారిమళ్లించి హైదరాబాద్‌కు తరలిస్తుండటంతో గోశాల నిర్వాహకులు పట్టణ శివారులో పట్టుకోవడం జరిగిందన్నారు. డీసీఎం నంబర్ టీఎస్ 30 టీఏ0850 లో తనిఖీ చేయగా 24గోవులు ఉన్నాయన్నారు. డీసీఎంలో ఉన్న ఎల్. భాస్కర్, ఎ. సంతోష్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే గేటు మూసివేత

కమలాపూర్, జనవరి 2 : హసన్‌పర్తి-ఉప్పల్ రైల్వేస్టేషన్‌ల మధ్య గల ఎల్కతుర్తి మండలంలోని బావుపేట రైల్వే గేటు (నెంబరు 9ఈ) ఈ నెల 4, 5వ తేదీ వరకు రెండు రోజుల పాటు గేటు మూసివేయనున్నట్లు కాజీపేట రైల్వే సీనియర్ సెక్షన్ అధికారి జీపి.సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్-హనుమకొండ వెళ్లే మార్గం లోని ఏకైక గేటు కావడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ఆయన సూచించారు. కాగా హసన్‌పర్తి-ఉప్పల్ రైల్వే స్టేషన్‌ల మధ్య కొత్తగా వేసిన మూడో రైల్వె లైన్ ట్రాఫిక్, పవర్ బ్లాకింగ్ అనుసంధాన పనుల వల్ల సికింద్రాబాద్ నుంచి కాగజ్ నగర్ మార్గంలో నడిచే అన్ని ప్యాసింజర్ రైళ్లు ఈ నెల 13వ తేదీ వరకు రద్దు చేయబడ్డాయని, కేవలం హైదరాబాద్-కాగజ్‌నగర్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ట్రైన్ నెంబరు అప్ 17011, డౌన్ 17012 మాత్రమే నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

ఉచిత ప్రయాణంతో అద్దె బస్సులకు డీజిల్ భారం

హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ రీజినల్ అధ్యక్షుడు రాంరెడ్డి

ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేత


ఆర్ఎం శ్రీలతకు వినతిపత్రం అందజేస్తున్న హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ నాయకులు

సుబేదారి, జనవరి 2: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో అద్దె బస్సులకు డీజిల్ భారం పెరిగిందని హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ రీజినల్ అధ్యక్షులు మారిపెల్లి రాంరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని ఆర్టీసీ రీజియన్ కార్యాలయంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ ఆధ్వర్యంలో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జె. శ్రీలతకు అందజేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకానికి ముందు బస్సులలో 45 నుండి 60 మంది వరకు ప్రయాణికులు ప్రయాణించేవారని, ఇప్పుడు ఉచిత బస్సు పథకంతో ఆ సంఖ్య గణనీయంగా పెరిగి బస్సుల టైర్లపై భారం పడుతుందన్నారు. అలాగే బస్సుల కమాన్ పట్టీలు విరుగుతున్నాయని, బస్సు మెయింటెనెన్స్ విపరీతంగా పెరుగుతుందన్నారు. ఓవర్‌లోడ్ కారణంగా కేఎంపీఎల్ బాగా తగ్గిపోయిందని, దీనివల్ల 4.5 కేఎంపీఎల్ ఇవ్వాలన్నారు. జనవరి 5వ తేదీలోగా మా సమస్యలు పరిష్కరించాలని, లేదంటే 5 నుంచి సమ్మె చేస్తామని ఆర్ఎంకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు రాంరెడ్డి, తెలిపారు. ఆర్ఎంకు వినతిపత్రం అందజేసినవారిలో హైర్ బస్సు ఓనర్స్ రాష్ట్ర నాయకులు లక్కం ప్రభాకర్, కె. సదానందం, వెంకటేశ్వర్లు, పి. కుమార్, వి. వెంకట్‌రెడ్డిలు ఉన్నారు.

కారు ఢీకొని బాలుడి మృతి

- మహబూబాబాద్ జిల్లా ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద ఘటన


విజయ్‌ప్రకాశ్ (ఫైల్)

మహబూబాబాద్‌రూరల్, జనవరి 2 : కారు ఢీకొన్న ఘటనలో ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. గూడూరు మండలం మచ్చర్లకు చెందిన చింతల వినోద-సుధాకర్ దంపతులు హైదరాబాద్‌కు వలస పోయి కూలీనాలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు విజయ్‌ప్రకాష్ (8) అదే గ్రామంలోని అమ్మమ్మ ఈసం నర్సమ్మ వద్ద ఉంటూ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం సెలవులు రావడంతో హైదరాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. సోమవారం రాత్రి మహబూబాబాద్‌కు చేరుకున్న కుటుంబసభ్యులు రాత్రి కావడంతో ముత్యాలమ్మగూడెంలోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. తర్వాత మంగళవారం మధ్యాహ్నం మచ్చర్లకు వెళ్లేందుకు ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద ఆటో ఎక్కుతున్న క్రమంలో చెన్నారావుపేట నుంచి కురవికి వెళ్తున్న కారు ఆటోకు కుడివైపున ఉన్న బాలుడు విజయ్‌ప్రకాష్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తమ కళ్లముందే కుమారుడు మృతి చెందడంతో వారు ఒక్కసారిగా షాక్ గురయ్యారు. కొద్దిసేపట్లో స్వగృహానికి వెళ్లాల్సిన బాలుడు అనంతలోకాలకు వెళ్లడంతో కుమారుడి మృతదేహంపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు చివరి గడువు

హనుమకొండ రూరల్, జనవరి 2 : ప్రభుత్వ ప్రయివేట్ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఎవరైనా పరీక్ష ఫీజు చెల్లించనట్లయితే బుధవారం రూ.2500 అపరాధ రుసుంతో చెల్లించవచ్చని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి ఏ.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఈ విషయాన్ని గమనించి ఇంటర్ వార్షిక ఫీజు చెల్లించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

- మృతురాలి బంధువుల ఆందోళన
- ధర్మారంలో ఉద్రిక్తత


లక్ష్మీ (ఫైల్)


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న లక్ష్మీ బంధువులు

పరకాల , జనవరి 2 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన నడికూడ మండలం ధర్మారంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడికూడ మండలం ధర్మారం గ్రామానికి చెందిన నక్క లక్ష్మి (40), ఎర్రన్న దంపతులకు 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భర్తతో గొడవపడి లక్ష్మి ఐదేళ్లుగా వేరే ఇంట్లో కిరాయికి ఉంటోంది. డిసెంబరు 28న రేషన్ కార్డు విషయమై తన భర్త ఎర్రన్న ఇంటికి వెళ్లి మాట్లాడి తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామంలోని బొడ్రాయి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. బంధువులు, స్థానికులు గమనించి వెంటనే 108 ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి చికిత్స పొందుతూ జనవరి 1 (సోమవారం) మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం లక్ష్మీ మృతదేహాన్ని తన భర్త ఎర్రన్న ఇంటి ముందు వేసి బంధువులు రహదారిపై ధర్నా చేశారు. కొన్నేళ్లుగా ఎర్రన్న లక్ష్మీని పట్టించుకోలేదని, ఎర్రన్న ఆస్థిని లక్ష్మీ కూతురు పేరు మీద రాయాలని ఆందోళన చేశారు. ఎర్రన్న లక్ష్మీని ఇబ్బందులకు గురిచేసి కూతురు ఉన్నా వేరే పెళ్లి చే సుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీ కుటుంబానికి న్యాయం చేయాలని నినాదించారు. మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో పరకాల సీఐ వెంకటరత్నం, ఎస్సై లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి బంధువుల ను సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా లక్ష్మీ బంధువులు వినకపోవడంతో పోలీసులు బలవంతంగా లాక్కెళ్లారు. మహిళలను పక్కకు నెట్టివేయడంతో గ్రామ సర్పంచ్ గోల్కొండ ఉమ, ఆమె భర్త సదానందం సీఐతో వాగ్వాదానికి దిగారు. మహిళలను నెట్టివేయడం సరికాదన్నారు. చివరకు పరారీలో ఉన్న లక్ష్మీ భర్త ఎర్రన్నను తీసుకువస్తామని సీఐ హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

ప్రజాసమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ లక్ష్యం

- పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే నాగరాజు


నందనం గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, జనవరి 2: ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ సంక్షేమ ఫలాలను అర్హులందరికి అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా మంగళవారం నందనంలో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ ఐదు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తులు ఇవ్వని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం మరిన్ని రోజుల గడువు ఇవ్వడానికి కృషిచేస్తుందన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీవో రఘుపతిరెడ్డి, సర్పంచ్ యాకర మంజులయాదగిరి, ఎంపీటీసీ జెట్టబోయిన లక్ష్మి, ఉప సర్పంచ్ మౌనికరాము, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ నాయకులు పెన్నులు, పెన్సిళ్ల ఎమ్మెల్యేకు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో అనారోగ్యానికి గురైన వారిని పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు బండి సంపత్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నత, ప్రాధమిక పాఠశాలలోని సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలోని గుంతలను పరిశీలించిన ఎమ్మెల్యే ముందుగా వాటిని పూడ్చి వేయాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ అధికారులతో కలిసి పాఠశాలల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అడిషినల్ కలెక్టర్ మహేందర్‌జీకి సూచించగా పాఠశాలలను సందర్శించి నివేదికను అందజేస్తామని తెలిపారు. నందనంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఫ్లెక్సీల వివాదం తలెత్తి ఫ్లెక్సీలను చింపి తొలగించారు. ఎమ్మెల్యే తొలి సారి ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామానికి వస్తున్నాడని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఎన్నికల ముందు పార్టీలో చేరినవారితోపాటు స్థానికంగా ఉండని వారు ఫ్లెక్సీల్లో తమ ఫోటోలను పెద్దవిగా ముద్రించుకొని సీనియర్ల ఫోటోలు పెట్టలేదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఫ్లెక్సీల వివాదానికి తెరతీసి చింపివేశారు. ఎమ్మెల్యే వస్తే పరువుపోతుందని గ్రామ పార్టీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను మొత్తం తొలగించి వివాదానికి తెరదించారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతుల షురూ


కురవి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 2 : జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 104, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు 15, మోడల్ స్కూల్స్ 8 వెరసి 127 పాఠశాలలుండగా వాటిల్లో 4405 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారిలో బాలురు 2296, బాలికలు 2109 మంది మార్చి 18న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగనున్న వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రభుత్వం నిర్ణయించిన కాల నిర్ణయ పట్టికతో పాటు ప్రతి రోజు ఉదయం 8 :30 నుంచి 9:30 వరకు, సాయంత్రం 4:45 నుంచి 5:45 వరకు ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున తరగతులు నిర్వహిస్తూ పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థి 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి జిల్లా వందశాతం ఫలితాలు సాధించే విధంగా పక్కా ప్రణాళికతో విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నారు.

ఆరు పేపర్లు, ఏడు పరీక్షలకు అనుగుణంగా...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలు ఆరు పేపర్లుండగా ఏడు పరీక్షలు నిర్వహించేందుకు వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో తెలుగు, హింది, ఇంగ్లీష్, సామాన్యశాస్త్రం, గణితం, సాంఘీక శాస్త్రం 6 సబ్జెక్టులకు ఆరు పరీక్షలు నిర్వహించగా ఈ ఏడాది నిర్వహించనున్న వార్షిక పరీక్షలకు సామాన్య శాస్త్రంను భౌతికరసాయనశాస్త్రం, జీవశాస్త్రం పేపర్లుగా విభజించి పరీక్ష నిర్వహించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో ఏడు పేపర్లకు అనుగుణంగా మాదిరి ప్రశ్నాపత్రాలు, వాటికి వచ్చే మార్కుల ప్రకారం విద్యార్థులను సంసిద్ధులను చేసేందుకు అన్ని చర్యలు చేపట్టారు. దీంతో డిసెంబరు చివరి నాటికి సిలబస్ పూర్తి చేయించిన విద్యాశాఖ జనవరి 2 నుంచి రెగ్యులర్ తరగతులలో సిలబస్ రివిజన్ చేయడంతో పాటు హెచ్ఎంలు ప్రత్యేక తరగతులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



తొర్రూరులో క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న యశస్విని రెడ్డి

తొర్రూరు, జనవరి 2: ఉపాధ్యాయులతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి హాజరైన ఎమ్మెల్యే సంఘం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ పీఆర్సీ, ఐఆర్ విషయంలో ఉపాధ్యాయులకు మేలు జరిగేలా సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఆమె హామీ ఇచ్చా రు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుధాకరాచారి, ప్రధాన కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు చంద్రప్రకాశ్, ప్రభాకర్‌రావు, చంద్రమౌళి, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల వద్ద జనం బారులు



జనగామ ఆర్టీసీ చౌరస్తా దగ్గర బంకులో బారులు తీరిన వాహనదారులు

జనగామ టౌన్, జనవరి 2: మోటారు వాహనాల చట్ట సవరణను నిరసిస్తూ పెట్రోల్, ఆయిల్ ట్యాంకర్ల యజమానులు సమ్మెకు దిగారన్న వార్తలతో వాహనదారులు ఆందోళన చెందారు. పెట్రోల్, డీజిల్ దొరుకుతుందో, లేదోనన్న భయంతో బంకులకు పరుగులు తీశారు. దీంతో జనగామలో పలు పెట్రోల్ బంకులు మంగళవారం సాయంత్రం వినియోగదారులతో కిక్కిరిసిపోయాయి. ఒక్కసారిగా జనం ఎగబడడంతో సిబ్బంది వారిని నిలువరించలేక ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉండగా సాయంత్రం వరకే పలు బంకులకు పెట్రోల్ ట్యాంకర్లు వచ్చినట్లు తెలిసింది.

ఇందిరమ్మ లబ్ధిదారులకు రూ.5 లక్షలివ్వాలి



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

జనగామ టౌన్, జనవరి 2: ఇందిరమ్మ మూడో విడత లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి ద్వారా రూ.5 లక్షల లోన్ ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జనగామ మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ చంద్రమౌళికి వినతిపత్రం అందజేశారు. ఇల్లు కట్టుకునే స్థోమత లేక వదిలేశారని, లోన్లు ఇస్తే కట్టుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్రి అహల్య, జోగు ప్రకాశ్, బూడిద గోపి, కల్యాణం లింగం, ఎండీ.గౌసియా, ఎర్ర రజిత, జయ, శశిరేఖ, బాలమణి, కమల, నాజియా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గేటు ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం

చిలుపూర్, జనవరి 2: మండలంలోని ఫతేపూర్‌లో ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ గేటును సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఎత్తుకెళ్ళేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి ఒక సైడ్ గేటు గోడ పక్కన పడిఉందని హెచ్ఎం సరోజన తెలిపారు. పథకం ప్రకారమే గేటును ఎత్తుకెళ్ళాలని ప్రయత్నించినప్పటికీ రెండోది రాకపోవడంతో, మొదటి గేటును సైతం అక్కడే వదిలేసి వెళ్ళారని అన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం తెలిపారు.

వాసవీ వనిత క్లబ్ ప్రమాణ స్వీకారం

జనగామ టౌన్, జనవరి 2: వాసవీ వనిత గ్రేటర్ జనగామ క్లబ్ నూతన కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. జనగామలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా గవర్నర్ గంపా సాంబమూర్తి ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడిగా పడకంటి రవీందర్ వరుదిని, కార్యదర్శులుగా గంగిశెట్ట అనుజ, గట్టు రాధాకృష్ణ, కోశాధికారిగా కొత్తకొండ సంతోష్, పులిగిల్ల నాగమణి ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వాసం రామ్మూర్తి



దేశాయితండాలో తహసీల్దార్ సరస్వతికి సూచనలిస్తున్న ఆర్డీవో వాసం రామ్మూర్తి

చిలుపూర్, జనవరి 2: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వాసం రామ్మూర్తి సూచించారు. మంగళవారం దేశాయితండా, వెంకటాద్రిపేట గ్రామాల్లో ఆయన ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. దరఖాస్తు ఫారాల పంపిణీ, ఏర్పాట్ల విషయమై తహసీల్దార్ సరస్వతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని, తగు సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కోర్నేలియస్, హెఈవో చాడ బుచ్చిరెడ్డి, సర్పంచులు కందుల రఘుపతి, సోనియా, ఎంపీటీసీలు భూక్య యాదగిరి, ఎన్నకూస కుమార్, ఐకేపి ఏపీఎం ఈద రమేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దూలమ్మ, ఏఈవో గుగులోత్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: మండలంలోని తిడుగు, సాగరం, తిమ్మాపూర్, లక్ష్మీనాయక్‌తండాలో మంగళవారం అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనాయక్‌తండాలో జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారందరికీ పథకాలు అందుతాయన్నారు. ఈ సమావేశాల్లో తహసిల్దార్ అంజనేయులు, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ప్రత్యేకాధికారులు మనోహర్, శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు మంగళవారం మండలంలోని నాలుగు గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. కట్కూరు, వీఎస్ఆర్‌నగర్, కేశిరెడ్డిపల్లి బోనకొల్లూరు గ్రామాలలో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమ నిర్వహణను స్పెషల్ ఆఫీసర్లు ఇస్మాయిల్, బాలకృష్ణ, టీంలీడర్లు తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణ పరిశీలించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు మునిని సునీతరాజుగౌడ్, కోనేటీ స్వామి, మల్లవరం దివ్య, మీస ఐలుమల్లు, మాజీ ఎంపీపీ బావండ్ల కృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్ ఆచార్య, రుబీనా సుల్తానా, అనిల్ రాజ్, ధర్మ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల కోసం అధికారుల నిలదీత

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని రంగారాయగూడెం గ్రామంలో మంగళవారం ప్రారంభమైన ప్రజాపాలన గ్రామసభలో గ్రామస్థులకు సరిపడా దరఖాస్తులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు వదిలిపెట్టుకొని దరఖాస్తుల కోసం ఇక్కడికి వచ్చామని, దరఖాస్తులు లేకుండా ఎందుకు వచ్చారని మండిపడ్డారు. అందరికీ దరఖాస్తులు బుధవారం అందిస్తామని ఎంపీవో సుధీర్‌కుమార్ నచ్చజెప్పినప్పటికీ శాంతించలేదు. సుమారు రెండుగంటల పాటు వాగ్వాదం అనంతరం గ్రామస్థులు శాంతించి వెళ్లిపోయారు.



అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

అయోమయంగా 'ప్రజాపాలన'

అవగాహన లేకుండా దరఖాస్తులు ● కావాలనే కాలయాపన చేస్తున్న సర్కారు ● ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 2: ఇచ్చిన హామీలను తప్పించుకోవడానికి, కాలయాపన చేయడానికి, ప్రజలను అయోమయానికి గురి చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను తీసుకువచ్చిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. మంగళవారం ఆయన దేవాదుల ప్రాజెక్టును, దిగువన ఉన్న కాలువలను, రిజర్వాయర్ తూములను పరిశీలించారు. అనంతరం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా 48వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి దేవాదుల రిజర్వాయర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రిజర్వాయర్‌ను నిర్మించే క్రమంలో దిగువన 4,800 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి నాలుగు తూములను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం తూములు, వాటి అనుసంధానంగా ఏర్పాటు చేసిన కాలువలు ధ్వంసమయ్యాయన్నారు. వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేబట్టి రైతులకు సాగునీరు అందించాలని అధికారులను ఆదేశించానన్నారు. శాశ్వత పనుల కోసం ప్రభుత్వానికి నివేదిక ఇస్తానన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజాపాలన దరఖాస్తులను అవగాహన లేకుండా రూపొందించారన్నారు. అందులో పొందుపరిచిన కాలమ్స్ సరిగ్గా లేవన్నారు. రైతులను, కౌలు రైతులను, వ్యవసాయ కూలీలను, ఉద్యమకారులను ఎలా గుర్తిస్తారో స్పష్టత లేదన్నారు. ఇప్పటివరకు కేవలం ఎకరం లోపు రైతులకే రైతుబంధు డబ్బులు జమ చేశారని, రూ.15వేల మాట దేవుడెరుగు.. కనీసం గత ప్రభుత్వం అందించిన రూ.10వేలు అయినా అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలే తిరుగుబాటు చేస్తారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా జిమ్మిక్కులు చేస్తే ఊరుకోబోమన్నారు. అంతకు ముందు ఛాగల్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. డివిజన్ కేంద్రంలోని రైతు వేదికలో 18 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బెలిదె వెంకన్న, నరేందర్ రెడ్డి, రాపోలు మధుసూదన్ రెడ్డి, నీల గట్టయ్య, భూర్ల శంకర్, మందపురం ఎల్లాగౌడ్, అజయ్ రెడ్డి, రజాక్‌యాదవ్, గట్టు రమేష్, మనోహర్, మునిగెల రాజు, పల్లె రవీందర్, నీరటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వైభవంగా శోభాయాత్ర

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



కొడకండ్లలో శోభాయాత్ర నిర్వహిస్తున్న రామభక్తులు

కొడకండ్ల, జనవరి 2: అయోధ్య రామయ్య అక్షింతలతో మండలకేంద్రంలో మంగళవారం భక్తి శ్రద్ధలతో గ్రామస్థులు శోభాయాత్ర నిర్వహించారు. జనవరి 22న అయోధ్యలో నిర్మిస్తున్న నూతన మందిరంలో శ్రీ బాలరాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్న సందర్భంగా 516 మంది వేదపండితులతో ముందుగా పూజించిన అక్షింతలను ప్రతీ హిందువు ఇంటికి అందజేయనున్నట్లు తెలిపారు. మండలకేంద్రంలోని రామాలయంలో అక్షింతలకు వేదపండితులు పాలకుర్తి గౌతం శర్మ, పిండిపోలు నాగదక్షిణామూర్తి, సోమయ్య పూజలు నిర్వహించారు. అనంతరం అన్ని వీధుల్లో భజనలతో, కోలాటాలతో, రామనామ సంకీర్తనలతో శోభాయాత్ర నిర్వహిస్తూ ప్రతీ హిందువు ఇంటికి వెళ్లి అందించారు. మిగతా గ్రామాల ప్రతినిధుల ద్వారా అందరికీ అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పసునూరి మధుసూదన్, మార్కెట్ చైర్మన్ పేరం రాము, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, శింగరం చంద్రయ్య, మార్కెట్ డైరెక్టర్ కుందూరు అమరేందర్‌రెడ్డి, దోర్నం ప్రభాకర్, శేఖర్, రమేశ్, మసురం వెంకటనారాయణ, ఎస్.కోటేశ్వర్, ఎం.సోమన్న, పి.ఉపేందర్, ఎం.శ్రీనివాస్, కుమార్, జ్ఞానేశ్వరాచారి, రవి, అయ్యప్ప మాలధారులు. తదితరులు పాల్గొన్నారు.

నర్మెట: అయోధ్య అక్షింతలను మంగళవారం మండలకేంద్రంతో పాటు ఇప్పలగడ్డ గ్రామంలో శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ సభ్యులు ఇంటింటికీ తిరుగుతూ అందించారు. జై శ్రీరామ్ నినాదాలతో వీధులను మారుమోగించారు. కార్యక్రమంలో ఇప్పలగడ్డ సర్పంచ్ నీరటి రాణిసుధాకర్, బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు, శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నెల్లుట్ల కారోబార్ హఠాన్మరణం

లింగాలఘణపురం, జనవరి2: మండలంలోని నెల్లుట్ల గ్రామపంచాయతీ సీనియర్ కారోబార్ చెరుకు కృష్ణస్వామి(62) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయాన్నే విధుల్లో చేరిన కొద్దిసేపట్లోనే ఆయనకు గుండె నొప్పి రావడంతో అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించేలోగా మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, సర్పంచ్ చిట్ల స్వరూపారాణిభూపాల్‌రెడ్డి, ఎంపీడీవో సురేందర్‌నాయక్, ఎంపీవో మల్లికార్జున్, పంచాయతీకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చిలుపూర్, జనవరి 2: ముందుగా వెళ్తున్న ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళతో పాటు, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈర్ల రాజు అనే ఆటోడ్రైవర్ ఇద్దరు ప్రయాణీకులతో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి చిన్నపెండ్యాలకు వెళ్తుండగా వెనకనుంచి వేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న చిన్నపెండ్యాలకు చెందిన పేరాల కుమార్ తలకు తీవ్ర గాయం కాగా, వెంకటాద్రిపేటకు చెందిన వడాల ఉమారాణి అనే మహిళకు కాలు విరిగింది. బాధితులను చికిత్స నిమిత్తం ఆటో డ్రైవర్ రాజు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చిలుపూర్ ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో పాత్రికేయుడి మృతి



యాకస్వామి(ఫైల్)

రఘునాథపల్లి, జనవరి 2: రఘునాథపల్లి మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన పాత్రికేయుడు రాసమల్ల యాకస్వామి (38) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా మండల ప్రెస్ క్లబ్ సభ్యులతో పాటు ఫొటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు యాకస్వామి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు కుటుంబానికి ప్రెస్ క్లబ్ తరఫున, ఫొటోగ్రాఫర్స్ యూనియన్ తరుపున ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు మారజోడు రాంబాబు, బీర్రు మధు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నీలం ఐలేష్, సర్పంచ్ కొయ్యడ మల్లేష్ నివాళులర్పించారు.

అక్రమంగా చెట్ల నరికివేత

లింగాలఘణపురం, జనవరి 2: మండలంలోని నేలపోగుల శివారులో మంగళవారం ఆంధ్రా ప్రాంతానికి చెందిన కర్ర వ్యాపారులు వనపర్తి- చిన్నమడూరు రహదారిపై గల వేప చెట్లను అక్రమంగా నరికేశారు. సమాచారం అందుకున్న గ్రామస్థులు వారిని అడ్డుకున్నారు. ఓ వైపు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరిత హారం కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా మొక్కలను నాటుతుండగా మరోవైపు చెట్లను నరికివేయడం దారుణమని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ టౌన్, జనవరి 2: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రూపొందించిన 2024 సంవత్సరం క్యాలెండర్, డైరీని మంగళవారం కలెక్టర్ శివలింగయ్య తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మయ్య, రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సునంద, వజ్రయ్య, ఎండీ. అంకుశావలి, శ్రీహరి, శ్రీరాములు, వెంకన్న పాల్గొన్నారు.

పాలకుర్తి: టీపీటీఎఫ్ 2024 నూతన క్యాలెండర్‌ను మంగళవారం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్, నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య, వెంకటనర్సయ్య, శేషు, ఇందిర, శ్రీనివాస్, శాహేసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు 25,139 దరఖాస్తులు

జనగామ టౌన్, డిసెంబరు 30: ప్రజాపాలన కార్యక్రమం జిల్లాలో నాలుగో రోజు ప్రశాంతంగా కొనసాగింది. మంగళవారం జనగామ నియోజకవర్గంలో 7,543, పాలకుర్తి నియోజకవర్గంలో 6,790, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 10,626 దరఖాస్తులు రాగా.. జిల్లా వ్యాప్తంగా 25,139 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. బచ్చన్నపేటలో 2154, జనగామ రూరల్‌లో 2081, నర్మెటలో 965, తరిగొప్పులలో 845, జనగామ అర్బన్‌లో 1498 దరఖాస్తులు, చిల్పూరులో 1989, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 2314, లింగాలఘణపురంలో 1333, రఘునాథపల్లిలో 2580, జాఫర్‌గఢ్‌లో 2410 దరఖాస్తులు, దేవరుప్పులలో 537, కొడకండ్లలో 2826, పాలకుర్తిలో 3607 దరఖాస్తులు వచ్చాయి.

కోడె దూడలను పట్టుకున్న బీజేపీ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 2: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం నుంచి తొర్రూరుకు తరలిస్తున్న కోడెదూడలను వీహెచ్‌పీఎస్, భజరంగదళ్, ఏబీవీపీ నాయకులు పట్టుకున్నారు. మంగళవారం రాత్రి స్టేషన్ ఘన్‌పూర్ మీదుగా డీసీఎంలో 24 కోడెదూడలను తరలిస్తుండగా గమనించిన నాయకులు వ్యాన్‌ను అడ్డుకున్నారు. అందులో ఉన్న వ్యక్తులు తొర్రూరు సమీపంలోని కేబీ తండాకు తరలిస్తున్నామని చెప్పగా డీసీఎం వెంట ఇద్దరు నాయకులు అక్కడికి వెళ్లారు. తీరా అది తప్పుడు సమాచారం అని తేలడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వెళ్లి డీసీఎంను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ విషయమై సీఐ రాజును వివరణ కోరగా కోడెదూడలను పట్టుకున్నది వాస్తవమేనని, వాటిని ఎటు తరలిస్తున్నారనే విషయమై పూర్తి విచారణ తరువాత తెలియజేస్తామని అన్నారు.

ఘనంగా కొమ్మూరి జన్మదినం



డీసీసీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

జనగామ టౌన్, జనవరి 2: డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. డీసీసీ కార్యాలయంలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేకును కొమ్మూరి కట్ చేశారు. రైల్వే స్టేషన్ వద్ద చెంచారపు కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం, ధర్మకంచలో మాజీ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా కొమ్మూరి హాజరయ్యారు. రాజరాజేశ్వరి సేవా సదన్ అనాథ ఆశ్రమంలో చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లెల సిద్ధారెడ్డి, ఉడుత రవియాదవ్ అన్నం వడ్డించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బనుక శివరాజ్ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు వేమల్ల సత్యనారాయణరెడ్డి, గిరికొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు రామచందర్, వంగాల కల్యాణిమల్లారెడ్డి, నాయకులు పిట్టల సతీశ్, నాంపెల్లి అశోక్, నల్ల శ్రీరాములు, బొట్ల నర్సింగరావు, బండారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా తరిగొప్పులలో పార్టీ మండలాధ్యక్షుడు చిలువేరు సంపత్, మండల కోఆర్డినేటర్ వగలబోయిన యాదగిరి ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నర్మెటలో డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు గాదె మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ కల్యాణం మురళి, పీఏసీఎస్ డైరెక్టర్ కూకట్ల చంద్రమౌళి, తదితరులు కేక్ కట్ చేశారు. బచ్చన్నపేట చౌరస్తాలో కేక్ కట్‌చేసి ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంచిపెట్టారు. పార్టీ నాయకులు జిల్లెల్ల సిద్దారెడ్డి, నల్లగోని బాలకిషన్‌గౌడ్, వంచ వెంకటరెడ్డి, కోడూరు మహాత్మాచారి, అల్వాల ఎల్లయ్య, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్లకు సాంకేతిక సొబగులు

- ప్రైవేటుకు దీటుగా సౌకర్యాలు
- తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు
- ఆన్‌లైన్‌లో ఎస్‌సీఈఆర్‌టీ పాఠాలు
- ఆసక్తిగా వింటున్న విద్యార్థులు
- ప్రాజెక్ట్‌వర్కులు సులభతరం



కొడకండ్ల ప్రభుత్వపాఠశాలలో డిజిటల్ బోర్డుపై బోధిస్తున్న ఉపాధ్యాయుడు

కొడకండ్ల, జనవరి 2: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు స్కూళ్లలో సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. ఇందులో భాగంగా తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు (డిజిటల్ బోర్డు)లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. విడతలవారీగా అన్ని స్కూళ్లకు ఈ సౌకర్యం కల్పిస్తోం ది. డిజిటల్ బోర్డులపై కళ్లకుకట్టినట్టుగా పాఠాలు బోధించడంతో విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుం టున్నారు. ఫలితంగా అన్ని సబ్జెక్ట్‌లపై అవగాహన, ఆసక్తి పెంచుకుంటున్నారు. కొడకండ్ల మండలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి దశలో కొన్ని ప్రభు త్వ పాఠశాలల్లో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేసింది. మండలకేంద్రంలోని ప్రభుత్వోన్నత పాఠశాలతో పాటు ఏడునూతుల పాఠశాలలకు 3 చొప్పున డిజిటల్ బోర్డులను అందజేసింది. ఈ రెండు పాఠశాలల్లో డిజిటల్ బోర్డులపై ప్రస్తుతం విద్యార్థులకు బోధన జరుగుతోంది. దీంతో ఆయా విద్యార్థులలో విద్యాపరం గా గణనీయమైన మార్పు కనబడుతోంది. ఆసక్తిగా పాఠాలు వినడమేకాక ఆకలింపు చేసుకుంటున్నారు.

పాఠాలు బాగా అర్థమవుతున్నాయి : భారత హర్షిణి, 9 వ తరగతి, జడ్పీఎస్ఎస్ కొడకండ్ల



డిజిటల్ బోర్డులపై ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు సులభంగా అర్థమవుతున్నాయి. అంతేకాకుండా పాఠ్యాంశాలు ఎల్లకాలం గుర్తుంటున్నాయి. సామాన్యశాస్త్రంలో మాన శరీర నిర్మాణం, భాగాలు, నరాలు, రక్తప్రసరణ తదితర అంశాలను కళ్లకు కట్టినట్లుగా చూపిస్తున్నారు. ఇదేవిధంగా ప్రతీ సబ్జెక్టులో కూడా ఆన్‌లైన్‌లో పుస్తకాలను, పాఠాలను, వీడియోలను డౌన్‌లోడ్ చేసి చెబుతున్నారు. అవన్నీ కూడా చాలా ఆసక్తిగా వింటున్నాం.

అద్భుతమైన ఫలితాలు కనబడుతున్నాయి : వై.గ్రేస్ కేజియా రాణి, నోడల్ ఆఫీసర్, కొడకండ్ల



డిజిటల్ బోర్డులపై విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా దృశ్యరూపకంగా పాఠాలు చెప్పగలుగుతున్నాం. ఆన్‌లైన్ ద్వారా ఎస్‌సీఈఆర్‌టీ పాఠాలు కూడా చెప్పిస్తున్నాం. విద్యార్థులు చాలా ఆసక్తిగా విని అర్థం చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో విద్యార్థులకు అవసరమైన అన్నిరకాల విషయాలపై ఆసక్తి, అవగాహన పెరుగుతోంది. అంతేకాకుండా ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ప్రస్తుతం డిజిటల్ బోర్డులపై ఇస్తున్నాం.

రెండవ ఫేజ్‌లో మరికొన్ని..

డిజిటల్ బోర్డులపై విద్యాబోధన సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్రప్రభుత్వం రెండో ఫేజ్‌లో మరికొన్ని పాఠశాలలకు డిజిటల్ బోర్డులను అందజేయాలని నిర్ణయించింది. జడ్పీహెచ్ఎస్ మొండ్రాయికు 3, జడ్పీహెచ్ఎస్ రామవరంనకు 2, కేజీబీవీ కొడకండ్లకు 4, మోడల్ స్కూల్ కొడకండ్లకు 6, టీఎస్ఆర్ఈఐఎస్ కొడకండ్లకు 3 డిజిటల్ బోర్డులు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ వల్ల కొంత ఆలస్య మైనా త్వరలో ఆయా పాఠశాలలకు చేరుకుంటాయని అధికారులు చెపుతున్నారు.

నిర్వహణ మెరుగుపడాలి..

ఎన్ని లక్షలు ఖర్చు చేసి డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేసినా నిర్వహణ సరిగ్గా లేకపోతే అవి మూలన పడే ప్రమాదముంది. మొదటి ఫేజ్‌లో మంజూరైన కొడకండ్ల పాఠశాలలోని 3 డిజిటల్ బోర్డులలో ఒకటి మొదటి రోజు నుంచే పనిచేయడం లేదు. ఇప్పటికీ దాన్ని మరమ్మతు చేయించినవారు లేరు. అంతేకాకుండా ఇంటర్‌నెట్ సదుపాయాన్ని కల్పించకపోవడంతో ఉపాధ్యాయులు సొంత మొబైల్‌లకు అనుసంధానించి డిజిటల్ బోర్డులపై ప్రాజెక్ట్ వర్కులు చేయించాల్సివస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.